క్లుప్తంగా

జాబ్ మేళాకు 383 మంది హాజరు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సుధాకర్

చీరాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎన్ఆర్‌పీఎం హైస్కూల్ ఆవరణలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు 20 కంపెనీల హెచ్ఆర్‌లు హాజరయ్యారు. 383 మంది అభ్యర్థులు హాజరు కాగా 129 మంది ఎంపిక కాగా, 88 మంది రెండో దశ ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గంటా సుధాకర్ తెలిపారు. జాబ్ మేళాను ఎంతో మంది సద్వినియోగం చేసుకుని ఉద్యోగార్థులుగా మారారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఐసయ్య, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి రమాదేవి, ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ డి.రమేష్‌బాబు, ఎన్ఆర్‌పీఎం స్కూల్ హెచ్ఎం వెంకటేశ్వరరావు, నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి కాశీవిశ్వనాథ్

వేటపాలెం: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తిచేయాలని గ్రామ ప్రత్యేక అధికారి ఐ కాశీవిశ్వనాథ్ సూచించారు. మండల పరిధిలోని పాపాయిపాలెం గ్రామ పంచాయతీలో పాపాయిపాలెం, అక్కాయిపాలెం గ్రామాలకు సంబంధించిన ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న వారికి మహిళా సంఘాల ద్వారా తక్కువ వడ్డీలకు రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసిన గృహ ప్రవేశాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి పి పూర్ణకుమారి, సీసీ వెంకట స్వామి, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు మల్లేశ్వరి, నాగశాంతి పాల్గొన్నారు.

మార్చి 17 మార్టూరులో ఉరుసు

మార్టూరు: మార్టూరులోని హజరత్ కరిముల్లా షా వలి 47వ ఉరుసు మహోత్సవం మార్చి 17వ తేదీ నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ సభ్యులు శుక్రవారం రాత్రి తెలిపారు. ఈ సందర్భంగా దర్గాను ఎలక్ట్రికల్ లైటింగ్‌తో ప్రత్యేకంగా అలంకరించారు. జెండాలను వెలుపలికి తీసి నిస్యాని కార్యక్రమంలో భాగంగా గ్రామ వీధుల్లో జెండాలను ఊరేగించి ఫాతిహా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు, స్థానిక ముస్లింలు పాల్గొన్నారు.



జెండా ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లింలు



అద్దంకి: మణికేశ్వరాలయం



చినగంజాం: ముస్తాబైన బాలకోటేశ్వరస్వామి ఆలయం

ఓం మహాప్రాణ దీపం.. శివం శివం

- శివరాత్రికి ముస్తాబైన శైవక్షేత్రాలు
- నేడు మహాశివరాత్రి



జే.పంగులూరు: ఆలయ గర్భగుడిలోని శివలింగం



చినగంజాం: ఏర్పాటు చేసిన నారాయణ ప్రభ

జే.పంగులూరు/బల్లికురవ/అద్దంకి: ఆదిమధ్యాంతరహితుడు సర్వేశ్వరుడైన శివయ్యకు ఇష్టమైంది మహాశివరాత్రి. ఈపర్వదినానికి శైవాలయాలు సిద్ధం అయ్యాయి. పంగులూరు మండలంలోని చందలూరు, పంగులూరు, రామకూరు గ్రామంలో శివరాత్రికి ప్రాచీన దేవాలయాలను విద్యుత్ అలంకరణలతో తీర్చిదిద్దారు. అతి ప్రాచీన కాలంనాటి పంగులూరు భీమలింగేశ్వర ఆలయం. పంగులూరు గ్రామం పేరు నాగపురి అని పిలిచేవారు. ఈ ప్రాతంలో పుట్టలు ఎక్కువగా ఉండటం వలన తరువాత పుట్టలూరుగా మారింది. తూర్పు చాళుక్యుల కాలంలో పుంగనూరు అని పిలువగా, మహమ్మదీయుల కాలంలో పుంగలూరు అని పిలిచేవారు. బ్రిటీషుల కాలం నుంచి పంగులూరుగా పిలువబడుతోందని చరిత్ర చెప్తోంది. రావణ సంహార అనంతరం రాముడు లక్ష్మణుడు ఈ ప్రాంతంలో సంచరించి శివలింగాన్ని ప్రతిష్టించాడని చరిత్ర చెప్తోంది. శివలింగం ఎత్తు ఆరడుగులు. క్రీస్తు శకం 915–920 కాలంలో మధ్య తూర్పు చాళుక్య రాజైన భీముడు శివలింగంపై దేవాలయం నిర్మించాడు. అప్పటి నుంచి భీమలింగేశ్వర స్వామిగా పిలువబడుతోంది. కన్నడ కవిత్రయములోని పొన్నడు ఈ గ్రామానికి చెందినవాడు.

బల్లికురవ మండలంలోని చెన్నుపల్లి, కొనిదెన, కొండాయపాలెం, వేమవరం, గుంటుపల్లి, చిన అంబడిపూడి, వైదన, ముక్తేశ్వరం, సూరేపల్లి, కొప్పరపాడు గ్రామాల్లోని శివాలయాలను శివగాత్రి పర్వదిన సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించారు. కొనిదెన గ్రామంలోని బ్రహ్మగుండం సమీపంలో వెలసిన నాగలింగేశ్వరునికి అభిషేకాలు, శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

అద్దంకి మండలంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. ప్రధానంగా దక్షిణ కాశిగా పేరుగాంచిన మణికేశ్వరం మల్లీశ్వరస్వామి దేవస్థానంలో ఆలయ ధర్మకర్త, ఈవో ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాటు చేశారు. గుండ్లకమ్మ నది వద్ద స్నాన ఘట్టాలు, ప్రత్యేక క్యూలైన్లు, ప్రసాదాలు సిద్ధం చేశారు. అదే విధంగా పట్టణంలోని కమతేశ్వర, నగరేశ్వర, రామలింగేశ్వర, మండలంలోని తిమ్మాయపాలెంలోని గంగాపార్వతీ సమేత చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు..

యద్దనపూడి/పర్చూరు/కారంచేడు: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని శివాలయాలన్ని సర్వాంగసుందరంగా అలంకరించారు. ఈ ఏడాది మహాశివరాత్రితో పాటు శనిత్రయోదశి కూడా రావటంతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మండలంలోని పూనూరు త్రిపురాంతకస్వామి, గన్నవరం కాశీ విశ్వేశ్వరస్వామి, యద్దనపూడి రామలింగేశ్వర స్వామి, పోలూరు చెన్నుమల్లికార్జునస్వామి ఆలయాల్లో శివరాత్రి ఉత్సవాలకు నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

■ వందేళ్ల చరిత్ర ఉన్న కారంచేడు పెద్ద బజారు శివాలయాన్ని ఆలయ కమిటీ, భక్తులు సంయుక్తంగా ఆలయాలను సిద్ధం చేశారు. శనివారం రాత్రి 11 గంటల నుంచి ఆదివారం ఉదయం 5 గంటల వరకు లింగోద్భవ పూజలు, అన్నాభిషేకం, 32 రకాల పండ్లతో అభిషేకాలు నిర్వహిస్తామని ఆలయ అర్చకులు కారంచేటి వీరాంజనేయశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. చెరుకూరులో నేడు మహాశివరాత్రి ఉత్సవాలు..

■ పర్చూరు మండలంలోని చెరుకూరు ఆగస్తేశ్వర స్వామివారి దేవస్థానంలో శనివారం రాత్రి నుంచి మరుసటి రోజు ఆదివారం ఉదయం వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి నాగయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

చినగంజాంలో తిరునాళ్లకు భారీ ఏర్పాట్లు

చినగంజాం: శివరాత్రి తిరునాళ్ల చినగంజాంలో శనివారం ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. మండలంలో బాలకోటేశ్వరస్వామి ఆలయం, రామకోటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ కమిటీలు స్నేహపూర్వక వాతావరణంలో పోటాపోటీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో రాజుబంగారుపాలెం, కుక్కల వారి పాలెం, శాంతినగర్, కొత్తపాలెం, మూలగాని వారిపాలెం , రైల్వే సెంటర్, మున్నంవారిపాలెం గ్రామాలనుండి సుమారు 80 అడుగుల ఎత్తులో ఐదు భారీ విద్యుత్ ప్రభలు, కోలాటం, పౌరాణిక నాటకాలు, భరత నాట్యం ఏర్పాటు చేశారు. త్రివేణి సంగమం నుంచి తీసుకొని వచ్చిన నీటితో ఆలయ ప్రాంగణంలో కోనేరు ఏర్పాటు చేశారు. చీరాల డీఎస్పీ పీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో సుమారు 250 మందికి పైగా పోలీసుల సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

రెండు ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు..

బాలకోటేశ్వరస్వామి ఆలయం వద్ద 18 వతేదీ రాత్రి శివరాత్రి జాగరణను పురస్కరించుకొని సినీ, టీవీ జూనియర్ ఆర్టిస్టులచే మ్యూజికల్ నైట్, మిమిక్రీ, కోలాటం, భరతనాట్యం వంటి కార్యక్రమాలు, హైద్రాబాద్ సినీ జూనియర్ ఆర్టిస్టులచే జబర్దస్త్ ఏర్పాటు చేశారు. రామకోటేశ్వర స్వామి ఆలయం వద్ద రాక్ స్టార్ ఈవెంట్స్ ఒంగోలు ఆధ్వర్యంలో పాటకచ్చేరి, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసారు.



బాలకోటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జెయింట్ వీల్

ఎన్నికల్లో విజయ సారథులు మీరే



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలరామకృష్ణమూర్తి

- మార్చి 18 నుంచి 'జగనన్నే మా భవిష్యత్'
- ఎమ్మెల్యే కరణం బలరాం, నియోజకవర్గ పరిశీలకుడు హనుమంతరావు



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్

చీరాల: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించే గురుతర బాధ్యతతో పాటు విజయసారథులు మీరే కావాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌లు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక గోలి సదాశివరావు కల్యాణ మండపంలో కరణం వెంకటేష్ అధ్యక్షతన పట్టణంలోని సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు మురుగుడు హనుమంతరావులు పాల్గొని మాట్లాడారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు తమకు కేటాయించిన 50 గృహాల్లో ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించాలో దిశానిర్దేశం చేశారు. దేశంలో ఏ సీఎం చేయని విధంగా అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టారన్నారు. విద్య, వైద్యం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు కార్యక్రమాలను జరుపుతున్నారన్నారు. ఇచ్చిన హామీలను 95 శాతం పూర్తయ్యాయని అన్నారు. రానున్న ఎన్నికల దృష్ట్యా ప్రధాన పాత్ర పోషించాల్సింది గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లేనన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి కరణం వెంకటేష్‌ను గెలిపించాలన్నారు. కరణం వెంకటేష్ మాట్లాడుతూ సీఎం జగన్ చీరాలను ప్రత్యేక దృష్టితో చూస్తున్నారని, ఆయన జగనన్న కాలనీలతో పాటు పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించేందుకుగాను నియోజకవర్గానికి 29 ఎకరాలను కేటాయించారని చెప్పారు. త్వరలోనే 29 ఎకరాల స్థలాన్ని కేటాయించి నియోజకవర్గంలోని పేదలందరికి ఇళ్ల పట్టాలు అందిస్తామన్నారు. గృహ సారథుల రీజనల్ కో–ఆర్డినేటర్ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షాల కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, శిఖాకొల్లి రామసుబ్బులు, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, పోలీస్ హౌసింగ్ బోర్డు డైరెక్టర్ మల్లి వైష్ణవి, కౌన్సిలర్లు గోలి స్వాతి, మల్లెల లలిత, బత్తుల అనిల్, మించాల సాంబశివరావు, తాడివలస దేవరాజు, మామిడాల రాములు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ



క్రీడా సామగ్రి అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

పర్చూరు: మండలంలోని వీరన్నపాలెం ఎస్ఎస్‌బీజీబీపీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు అవసరమైన క్రీడా సామగ్రిని రోటరీ క్లబ్ ఆఫ్ సెంట్రల్ పర్చూరు సౌజన్యంతో బహూకరించారు. శుక్రవారం సామగ్రిని విద్యార్థులకు అందించారు. వీటిని వినియోగించుకొని క్రీడల్లో రాణించాలని దాతలు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు, కార్యదర్శి పంబి సధానంద రెడ్డి, తోటకూర శ్రీనివాసరావు, ఎం వెంకటసుబ్బయ్య, కొల్లా సుబ్బారావు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతాప్‌రెడ్డిపై దాడి అమానవీయం

పర్చూరు: విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుడుతూ అనేక మంది మేధావుల ప్రశంసలు అందుకుంటున్న ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డిపై దాడి హేయమైన చర్య అని, దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ టీఎఫ్ బాపట్ల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొజ్జా సురేష్, దండమూడి శాంతారావులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు హరిప్రసాద్, వర్కింగ్ ప్రసిడెంట్ కట్టా సుబ్బారావులు ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఈదర మహిళకు 108లో కాన్పు

ముండ్లమూరు: మండలంలోని ఈదర గ్రామానికి చెందిన గర్భిణి కె.మనీషా పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కి ఫోన్ చేశారు. సకాలంలో గ్రామానికి చేరుకొన్న 108 వాహనంలో మనీషాను అద్దంకి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువ కావడంతో కాన్పు అయ్యే అవకాశాలను గుర్తించారు. 108 ఈఎంటీ హరిబాబు వాహనాన్ని ఆపించి కాన్పు చేశారు. మనీషా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ సురక్షితంగా ఉండటంతో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మనీషా కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రతినిధులు

చీరాల అర్బన్: ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని ఆర్‌బీఐ ఎల్‌డీవో నాగరాజు అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ఆర్కే ఓరియంటల్ హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎల్‌డీఎం కృష్ణనాయక్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆర్థిక ప్రవర్తన కలిగి ఉండాలని, పొదుపు ఆర్థిక ప్రణాళిక బడ్జెట్‌పై పూర్తి అవగాహన ఉండాలన్నారు. పొదుపును బ్యాంకులోనే ఎందుకు చేసుకోవాలి, బ్యాంకులో చేసుకోవడం వలన కలిగే ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ మేనేజర్ లింగారావు, స్కూల్ ప్రిన్సిపాల్ అనీల్ కుమార్‌రెడ్డి, సమన్వయకర్త అశోక్, కౌన్సిలర్లు ప్రశాంత్, హేమంత్‌కుమార్, ప్రసాద్ కళాజాత బృందం పాల్గొన్నారు.

వేగంగా సామాజిక భవన నిర్మాణం



నిర్మాణంలో ఉన్న సామాజిక భవనం

బల్లికురవ: బల్లికురవలోని ఎస్సీ కాలనీ (మాలపల్లె)లో సామాజిక భవన నిర్మాణం రూ.15 లక్షలతో చురుకుగా జరుగుతోంది. రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ అద్దంకి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య కృషితో జిల్లా పరిషత్ నిధులు రూ.15 లక్షలు మంజూరు చేయించారు. ఇటీవలే నిర్మాణ పనులకు భూమి పూజతో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మూడు నెలల్లో నిర్మాణ పనులు పూర్తి చేసి కాలనీ వాసుల సామాజిక అవసరాలకు భవనాన్ని అందుబాటులోకి తెస్తామని మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ పీరువలి చెప్పారు.

ఉద్యోగోన్నతి మరపురాని అనుభూతి

బల్లికురవ: ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉద్యోగులకు విధి నిర్వహణలో ఉద్యోగోన్నతి పొందడం మరపురాని అనుభూతి అని బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అనీల్ కుమార్ అన్నారు. బల్లికురవ హెచ్‌ఈ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీలుగా పనిచేస్తున్న గుంటుపల్లి పార్థసారథి, సుభాషిణిలు ఉద్యోగోన్నతిపై స్కూల్ అసిస్టెంట్లుగా ఇటీవల మల్లాయపాలెం యూపీ, పూనూరు ఉన్నత పాఠశాలలకు వెళ్లారు. శుక్రవారం పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు పీ కోమలి, హెచ్‌ఎం బీ భారతి, పేరెంట్స్ కమిటీ అధ్యక్ష ఉపాధ్యక్షులు గుడిపాటి ప్రభు, పావులూరి నవ్య ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి అభినందించారు.

ఇమ్యూనైజేషన్ నిర్వహణ సక్రమంగా ఉండాలి

చీరాల టౌన్: గ్రామ పంచాయతీల్లోని ఆరోగ్య ఉపకేంద్రాల పరిధిలో వ్యాధి నిరోధక టీకాలు అదించే ప్రక్రియను సక్రమంగా చేయాలని పీహెచ్‌సీ సీహెచ్‌వో మోక్షవాణి సూచించారు. శుక్రవారం ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గ్రామ పంచాయతీల్లోని ఆరోగ్య ఉపకేంద్రాల్లో పనిచేస్తున్న ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్‌ఎంలతో ఇమ్యూనైజేషన్‌పై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆరోగ్య విస్తరణాధికారి మాట్లాడుతూ పంచాయితీల్లోని ఆరోగ్య ఉపకేంద్రాల పరిధిలోని ఐదేళ్లలోపు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు అందించాలన్నారు. సమావేశంలో ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే మొదటి ప్రాధాన్యత



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో రమేష్‌బాబు

కారంచేడు: గ్రామాల్లోని సమస్యల పరిష్కారంలో సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటుండాని ఎంపీడీవో ఆర్ రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని నాయుడువారిపాలెం, కొడవలివారిపాలెం, జరుబులవారిపాలెం సచివాలయం, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజల నుంచి ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతం చెయ్యాలన్నారు. సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టిందనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

యద్దనపూడి: మండలంలోని గన్నవరం, మార్టూరు దండుదారి వద్ద వేంచేసి ఉన్న గోవిందమాంబ సామేత మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవం శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు మంగళగిరి కమలాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది మహాశివరాత్రి పర్వదినం నాడు స్వామివారి శాంతి కల్యాణం నిర్వహించటం ఆనవాయితీగా వస్తోందన్నారు. స్వామివారి కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణ మహోత్సవంలో పాల్గొనాలని కోరారు.

మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి

- నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్



డ్రైనేజీని పరిశీలిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి కృష్ణమోహన్

మార్టూరు: గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ తదితర మౌలిక వసతులు కల్పించడం ద్వారా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. మండలంలోని ద్రోణాదుల గ్రామంలో శుక్రవారం విస్తృతంగా పర్యటించిన ఆమంచి పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి మాట్లాడారు. మొదటిసారిగా తమ గ్రామ పర్యటనకు వచ్చిన ఆమంచికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. స్థానిక సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన స్థానిక, మండల నాయకులతో కలిసి ఎస్సీ కాలనీలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ, ముస్లిం కాలనీలతో పాటు గ్రామంలోని పలు వీధుల్లో పాదయాత్రగా బయలుదేరాడు. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించిన ఆమంచి మురుగు కాలువలను పరిశీలించి వాటి అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలు గురించి అధికారులు, స్థానికులతో చర్చించారు. ఇటీవల కూలీ పనులు కోసం బల్లికురవ మండలం వెళ్లి ట్రాక్టర్ ప్రమాదానికి గురైె చికిత్స పొందుతున్న కూలీల నివాసాలకు వెళ్లి వారిని పరామర్శించారు. బాధితులకు రూ.1.50 లక్షల ఆర్థిక సాయమందించి అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. స్థానిక పీహెచ్‌సీని పరిశీలించి వైద్యులు, సిబ్బంది, రోగులను అడిగి ఆసుపత్రి పనితీరు, సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. ముస్లిం కాలనీలో పర్యటించి అందరూ సమైక్యంగా ఉండాలని అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ వంకాయలపాటి బాగ్యారావు, ఎంపీటీసీ సభ్యులు సురేష్, ఏసోబు, మాజీ సర్పంచ్ పెంటాల సత్యం, సొసైటీ చైర్మన్ రాధాకృష్ణమూర్తి, ఉప సర్పంచ చేబ్రోలు అంజమ్మ, వెంకటేశ్వరరావు, పెంటాల బసవయ్య, మాజీ డైరీ చైర్మన్ ఉప్పలపాటి చెంగలయ్య, మండల కన్వీనర్ పఠాన్ కాలేషావలి, ఇతర నాయకులు బాబూనాయక్, రవిచంద్, తాటి వెంకటరావు, వినుకొండ సుధాకర్, అడపా సుధాకర్‌రెడ్డి, ఉప్పలపాటి అనిల్, గడ్డం మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.



ట్రాక్టర్ ప్రమాద బాధితులకు ఆర్థిక సాయమందిస్తున్న ఆమంచి

శింగరకొండ దర్శిని



అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం మాఘ మాసం ఉత్తరాషాడ నక్షత్రం త్రయోదశి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని శింగరకొండ దేవస్థాన ఏసీ సుభద్ర శుక్రవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న శనివారం ఆంజనేయస్వామికి ఇష్టమైన ఆకుపూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సుర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
చీరాల డివిజన్
90101 55593 (చీరాల)
Office mail : sakshiongads@gmail.com